సాక్షి
తూర్పుగోదావరి
బుధవారం । 22 । మే । 2024



అన్నదాన భవనానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి ఆకాష్ భట్నాగర్, అంజికా దంపతులు (రాజమహేంద్రవరం) మంగళవారం రూ.1,01,116 విరాళం అందజేశారు.



వస్తున్నాయ్ సత్యదేవుని రథచక్రాల్

దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రూ.1.04 కోట్లతో రూపొందించిన నూతన రథంపై అన్నవరం సత్యదేవునికి బుధవారం కన్నుల పండువగా రథోత్సవం నిర్వహించనున్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
40.0° / 27.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	38.0	27.0
కాకినాడ	37.0	27.7
అమలాపురం	40.0	27.0

న్యూస్‌రీల్

తాగునీటి సమస్య రాకుండా చర్యలు



కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: వేసవి నేపథ్యంలో జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా సమన్వయ శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.మాధవీలత ఆదేశించారు. ఉపాధి హామీ, విద్యుత్, తాగునీటి సరఫరా, ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలపై అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ మాధవీలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి పథకం కింద మే నెలాఖరుకు 21.41 లక్షల పని దినాలు లక్ష్యంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకూ 11.21 లక్షల పనిదినాలు పూర్తయ్యాయని వర్షా కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మరింతగా పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ పనులకు సంబంధించి రూ.1,182 లక్షలకు గాను 38.39 శాతం, ఇతర పనులకు రూ.1,896 లక్షలకు గాను 61.61 శాతంతో పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. రోహిణీ కార్తెను దృష్టిలో ఉంచుకుని లో ఓల్టేజీ సమస్య లేకుండా, నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జూన్ నాలుగో తేదీన జరిగే ఎన్నికల కౌంటింగ్‌కు పగడ్బందీ చర్యలు చేపట్టాలని, శాంతిభద్రతల సమస్యలు రాకుండా ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ఫలితాల విడుదల సందర్భంగా బాణసంచా వేడుకలపై నిషేధం ఉందని కలెక్టర్ మాధవీలత స్పష్టం చేశారు.

ఐటీఐ సీట్లు నూరు శాతం భర్తీ కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్ర ప్రసాద్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పారిశ్రామిక శిక్షణా సంస్థ(ఐటీఐ)ల్లో సమన్వయ శాఖల సహకారంతో నూరు శాతం సీట్లు భర్తీ చేయాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.హరిశ్చంద్ర ప్రసాద్ అన్నారు. ఈ అంశంపై ధవళేశ్వరంలోని ప్రభుత్వ ఐటీఐలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీఐ పాసైన విద్యార్థులకు పరిశ్రమల్లో ఉద్యోగాలు కల్పించే విధంగా, స్వయం ఉపాధి పొందే విధంగా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక ఎంతో అవసరమని అన్నారు. సమావేశంలో ట్రైనింగ్ ఆఫీసర్ బి.శివశంకర్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ ఎస్వీ సత్యనారాయణ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ప్రియ, ప్రైవేటు ఐటీఐల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణరావు, అనిల్ కుమార్, విద్యార్థులు పాల్గొని పలు సూచనలు చేశారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి వెండి చీర సమర్పణ



వెండిచీరను ఆలయ ఈవో వెంకటేశ్వరరావుకు అందజేస్తున్న దాతలు

తాళ్లరేవు: కేశవపురం శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ కేశవస్వామివారి దేవస్థానంలో వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ సూర్యనారాయణమూర్తి రూ.3 లక్షల విలువైన 3 కిలోల వెండిచీర సమర్పించారు. తన తల్లిదండ్రులు భాస్కరమ్మ, రామం జ్ఞాపకార్థం ఈ చీరను కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావుకు అందజేశారు.

21న లక్ష్మీనృసింహునికి మహా జ్యేష్టాభిషేకం

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వచ్చే నెల 21న సప్తనదీ తీర్థ మహా జ్యేష్టాభి షేకం నిర్వహిస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ మంగళవారం తెలిపారు. ఆ రోజు జ్యేష్టా నక్షత్ర పర్వదినాన గంగ, యమున, గోదావరి, సరస్వతి, నర్మద, సింధు, కావేరీ జలాలతో అర్చకులు, వేదపండితులు స్వామివారి మూలవిరాట్టుకు అభిషేకం చేస్తారన్నారు. ఇందులో పాల్గొనదలచిన భక్తులు రూ.400 చెల్లించాలని ఆయన తెలిపారు. వచ్చే నెల 3న ఆలయంలో స్వామికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నామన్నారు.

జీడిమామిడీలా..

మండలాల వారీగా జీడిమామిడి సాగు విస్తీర్ణం, దిగుబడి వివరాలు

మండలం	విస్తీర్ణం (హెక్టార్లు)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)
నల్లజర్ల	707	5.65
గోపాలపురం	1,198	9.58
దేవరపల్లి	1,352	10.52
నిడదవోలు	26	00.24
గోకవరం	598	388
కోరుకొండ	324	210
రంగంపేట	1,164	873
రాజానగరం	2,088	1,566
కొవ్వూరు	179	116
చాగల్లు	904	588
తాళ్లపూడి	333	216



- జిల్లాలో 8,875 హెక్టార్లలో సాగు
- ప్రతికూల పరిస్థితులతో గణనీయంగా తగ్గిన దిగుబడి
- గత ఏడాది 7 వేల మెట్రిక్ టన్నులు
- ఈసారి ఉత్పత్తి 3,986 మెట్రిక్ టన్నులేనని అంచనా

దేవరపల్లి: మెట్ట ప్రాంతంలోని ప్రధాన వాణిజ్య పంటల్లో ఒకటి జీడిమామిడి. మెట్ట భూములు, ఇసుక నేలలు, ఎర్ర నేలలు ఈ తోటల సాగుకు అనుకూలం. జిల్లాలోని వర్షాధార భూముల్లో ఎక్కువగా రైతులు ఈ పంట సాగు చేస్తున్నారు. ఉద్యాన శాఖ ద్వారా ప్రభుత్వం రాయితీలు ఇస్తూ రైతులను ప్రోత్సహిస్తోంది. అధిక దిగుబడులు ఇచ్చే వంగడాలను అందజేస్తోంది. ధర గిట్టుబాటు కావడంతో గడచిన ఐదేళ్లుగా రైతులు ఎక్కువగా జీడిమామిడి సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందారు. అంటు వేసిన మూడో ఏడాది నుంచే పంట దిగుబడి రావడంతో పాటు ఒకసారి అంటు వేస్తే దాదాపు 30 సంవత్సరాలు ఆదాయం వస్తోందని వారు చెబుతున్నారు. పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువగా ఉండటంతో జీడిమామిడి సాగుపై రైతులు మొగ్గు చూపుతున్నారు.

సగానికి సగం తగ్గిన దిగుబడి

జిల్లావ్యాప్తంగా 18 మండలాల్లోని 8,875 హెక్టార్లలో జీడిమామిడి సాగు జరుగుతోంది. ఏటా దాదాపు 7 వేల మెట్రిక్ టన్నుల జీడిగింజల ఉత్పత్తి జరుగుతోంది. అయితే, ఈ ఏడాది ప్రతికూల వాతావరణం, క్రిమికీటకాల వ్యాప్తి వంటి కారణాలతో దిగుబడి తగ్గి, రైతులు డీలా పడుతున్నారు. సాధారణ స్థాయి కంటే దిగుబడి హెక్టారుకు 5 నుంచి 6 బస్తాలు తగ్గిందని చెబుతున్నారు. జీడిమామిడి పూతలు నవంబర్, డిసెంబరు నెలల్లో ప్రారంభమవుతాయి. ఫిబ్రవరి నుంచి మే నెల వరకూ పంట దిగుబడి వస్తుంది. అయితే, గత ఏడాది డిసెంబర్ నెలలో మిచాంగ్ తుపాను ప్రభావంతో పూత దశలో అధికంగా వర్షాలు కురిశాయి. సరిగ్గా ఇదే దశలో టీ–దోమ వ్యాపించడం, పిందె దశలో చలి గాలులు వీచడం వంటి ప్రతికూల పరిస్థితులు జీడిమామిడి దిగుబడిపై ప్రభావం చూపాయి. పిందె (గొన్నెం) పట్టే సమయంలో ఉక్కపోత వాతావరణం ఉండాలి. కానీ, శీతగాలి కారణంగా కొన్నిచోట్ల పూత మాడిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో ఈ ఏడాది 3,986 మెట్రిక్ టన్నుల దిగుబడి మాత్రమే వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే గత ఏడాది కంటే దాదాపు 3 వేల మెట్రిక్ టన్నుల వరకూ దిగుబడి పడిపోయింది. హెక్టారుకు నాటు వంగడం 10 నుంచి 12 బస్తాలు, కొత్త వంగడం 20 నుంచి 24 బస్తాల మేర దిగుబడులు ఇస్తున్నాయని చెబుతున్నారు. సమగ్ర సస్యరక్ష చర్యలు పాటించి, ఉత్తమ యాజమాన్య పద్ధతుల్లో సాగు చేసిన రైతులు మాత్రం అధిక దిగుబడులు సాధిస్తున్నారని అంటున్నారు.

ధర ఉన్నా.. దిగుబడి లేక..

జిల్లాలో పండిన గింజలకు మంచి డిమాండ్ ఉంటుంది. జీడిపప్పు తయారీకి ఎక్కువగా ఈ గింజలను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. దీంతో ప్రస్తుతం జీడిగింజల ధర ఆశాజనకంగా ఉంది. గత ఏడాది బస్తా (80 కిలోలు) గింజల ధర రూ.7,300 ఉండగా, ఈ ఏడాది ఏకంగా రూ.2 వేలు పెరిగి, రూ.9,300 పలుకుతోంది. ముందు ముందు ఈ ధర మరింత పెరుగుతుందనే ఆశతో రైతులు ఉన్న గింజలను విక్రయించకుండా నిల్వ చేస్తున్నారు. ధర బాగున్నప్పటికీ దిగుబడులు పడిపోవడంతో నష్టపోతున్నామని వారు వాపోతున్నారు.



పూత దశలో టీ-దోమ వ్యాప్తి



పూత దశలో జీడిమామిడి తోటలకు టీ–దోమ వ్యాప్తి చెంది, పూత దెబ్బతింది. డిసెంబర్‌లో కురిసిన అధిక వర్షాల వల్ల పూతలు ఆలస్యంగా వచ్చాయి. పూత వచ్చే సమయంలో చలిగాలులు వీయడంతో గింజ పట్టలేదు. పిందె దశలో అధిక ఉష్ణోగ్రతల వల్ల పూత, పిందె దెబ్బ తిన్నాయి. ఈ సీజన్‌లో జిల్లావ్యాప్తంగా 3,986 మెట్రిక్ టన్నుల జీడిగింజల దిగుబడి మాత్రమే వస్తుందని అంచనా.

– సుజాత, జిల్లా ఉద్యానవన అధికారి, రాజమహేంద్రవరం

గింజల ఉత్పత్తి తగ్గింది



సాధారణంగా ఎకరాకు 8 నుంచి 10 బస్తాల దిగుబడి రావాలి. ఈ ఏడాది తోటలకు తెగుళ్లు వ్యాపించడంతో 5 నుంచి 6 బస్తాల దిగుబడి మాత్రమే వస్తోంది. పూత దశలో కురిసిన అధిక వర్షాలకు పూతలు రాలిపోయాయి. పిందె శాతం తక్కువగా ఉంది. దీనికితోడు పిందె దశలో చలిగాలులు వీయడంతో గింజ పట్టలేదు. ఫిబ్రవరి నుంచి అధిక ఉష్ణోగ్రతల వల్ల పిందె మాడిపోయింది. దీంతో జీడిమామిడి సాగు నష్టాల్లో ఉంది. లేత కాపులు కూడా నిలబడలేదు. శాస్త్రవేత్తలు తోటలను పరిశీలించి, రైతులకు సస్యరక్షణ చర్యలను వివరించారు.

– జె.రమణారెడ్డి, ఆదర్శ రైతు, గోపాలపురం

యాజమాన్య పద్ధతులను బట్టి..



జీడిమామిడి తోటల్లో ఉత్తమ యాజమాన్య పద్ధతులు, శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి జాగ్రత్తలు తీసుకుంటే దిగుబడులు బాగున్నాయి. ఎక్కువగా అధిక దిగుబడులు వస్తున్న వంగడాలను రైతులు సాగు చేస్తున్నారు. మామూలుగా ఎకరాకు 10 నుంచి 12 బస్తాల దిగుబడి వస్తోంది. ఈ ఏడాది కొంత వరకు తగ్గింది. జీడిమామిడిలో సస్యరక్షణ చర్యలు అవసరం. 10 ఎకరాల్లో జీడిమామిడి సాగు చేస్తున్నాను. ప్రభుత్వం నుంచి ఆదర్శ రైతు అవార్డు అందుకున్నాను.

– లకంసాని శ్రీనివాస్, ఆదర్శ రైతు, చిన్నాయగూడెం, దేవరపల్లి మండలం

పనుల ప్రగతిపై సంతృప్తి

వంతెన నిర్మాణాన్ని పరిశీలించిన ఏఐఐబీ బృందం



వశిష్ట నదీ పాయపై వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏఐఐబీ ప్రతినిధుల బృందం

పి.గన్నవరం: వశిష్ట నదిపై ఊడిమూడిలంక, జి.పెదపూడి లంక గ్రామాల ప్రజల కోసం రూ.49.5 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన పనులను ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) ప్రతినిధుల బృందం మంగళవారం పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేసింది. గతంలో వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని లంక గ్రామాల ప్రజలు కలుసుకుని, తాము పడుతున్న ఇబ్బందులను వివరించి, వంతెన నిర్మించాలని కోరిన విషయం విదితమే. దీంతో జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో వశిష్ట నదిపై వంతెన పనులు ప్రారంభమై, వేగంగా జరుగుతున్నాయి. దీంతో ఈ పనులను ఏఐఐబీ ప్రతినిధులు పరాద్ అహ్మద్ (బంగ్లాదేశ్), అశోక్‌కుమార్ (ఇండియా), యోగేష్ మల్లా (నేపాల్), లారా (ఫిలిప్పీన్), కౌశిక్ రెహమాన్ (బంగ్లాదేశ్)లు పీఆర్ సీఈ సీవీ సుబ్బారెడ్డి, ఎస్‌ఈ బి.రవీంద్ర, ఈఈ రమణమూర్తి తదితర అధికారులతో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకూ జరిగిన పనుల ప్రగతిని పీఆర్ డీఈఈ అన్యం రాంబాబు వారికి వివరించారు. సుమారు రూ.9 కోట్ల మేర పనులు జరిగాయని ఆయన తెలిపారు. ఈ ప్యాకేజీలో భాగంగా ప్రధాన పంట కాలువపై వంతెన నిర్మాణ పనులు 75 శాతం పూర్తి అయ్యాయి. నదిపై వంతెన పనుల్లో భాగంగా ఏటిగట్టు వద్ద మూడు కల్వర్టు బాక్సులు, ఐదు పిల్లర్లను నిర్మించారు. వీటిలో మూడు పిల్లర్లు పూర్తి కాగా, మరో రెండు నిర్మాణంలో ఉన్నాయి. అబెట్ పిల్లర్ నుంచి 210 మీటర్ల అప్రోచ్ రోడ్డు పూర్తయిందని డీఈఈ వివరించారు. పనుల ప్రగతి పట్ల కాంట్రాక్టు సంస్థను ఏఐఐబీ బృందం అభినందించింది. సైట్‌లో ఒక మహిళ రోలర్‌తో రోడ్డు చదును చేయడాన్ని చూసిన బృందం ఆమెను అభినందించారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని బృంద సభ్యులు సూచించారు. పీఆర్ ఈఈ కె.చంటిబాబు, ప్రాజెక్ట్ అడ్వయిజర్ ప్రభాకర్‌రెడ్డి, నరసింహరావు, ఏఈఈ సత్యనారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



పెద్దాపురంలో ర్యాలీ చేస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

పెద్దాపురం: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కాకినాడలోని ఎన్‌సీసీ 18వ ఆంధ్రా బెటాలియన్ కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ అన్నారు. ఆంధ్రా – తెలంగాణ ఎన్‌సీసీ ఇంటర్ డైరెక్టరేట్ స్పోర్ట్స్ షూటింగ్ చాంపియన్‌షిప్ (ఐడీఎస్ఎస్‌సీ)–2024కు ఎంపికైన క్యాడెట్లకు వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లతో మంగళవారం యాంటీ డ్రగ్, యాంటీ టుబాకో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కల్నల్ వివేక్ సావన్ గౌడర్ మాట్లాడుతూ, యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును పాడు చేసుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు వాడకంలో మన దేశం ముందంజలో ఉందన్నారు. యువతను సంఘ విద్రోహ శక్తులు మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చివేస్తున్నాయన్నారు. ఎన్‌సీసీతో ప్రతి విద్యార్థికీ మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. దృఢసంకల్పం, ఆత్మవిశ్వాసం, నిబద్ధతతో కూడిన శిక్షణ ఎన్‌సీసీతోనే సాధ్యమని సావన్ గౌడర్ అన్నారు. అనంతరం సుమారు 520 మంది పురుష, మహిళా క్యాడెట్లతో స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ నుంచి గుర్రాల సెంటర్, దర్గా సెంటర్, మెయిన్ రోడ్డు మీదుగా మున్సిపల్ సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. పొగాకు పీల్చకు – జీవిత దీపాన్ని ఆర్పకు, మత్తుకు బానిస అవకు – జీవితాన్ని చిత్తు చేసుకోకు, డ్రగ్స్ నిర్మూలన – యువత బాధ్యత అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సుబేదార్ హేమంత కుమార్, భాస్కర్‌రెడ్డి, కిషోర్, తొమ్మిది మంది ఎన్‌సీసీ, 29 మంది ఆర్మీ అధికారులు పాల్గొన్నారు.

చక్రస్నానానికి.. చెక్కిన కోనేరు



పంపా నదిలో జేసీబీతో కోనేరు తవ్వకం పనులు


అన్నవరం: వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే సత్యదేవుని శ్రీచక్రస్నాన మహోత్సవానికి పంపా జలాశయంలో కృత్రిమంగా కోనేరు సిద్ధం చేశారు. గత ఏడాది తగినన్ని వర్షాలు లేకపోవడం.. ఉన్న నీటిని రబీ సాగుకు విడుదల చేయడంతో పంపా నదిలో నీరు అడుగంటిన విషయం విదితమే. దీనిపై 'సాక్షి' ''ఎండిపోయి'నది'' శీర్షికన గత నెల పదో తేదీన కథనం ప్రచురించింది. సత్యదేవుని చక్రస్నానానికి నీటి సమస్య ఉత్పన్నమవుతుందని ఆ కథనంలో పేర్కొంది. దీనిపై స్పందించిన అన్నవరం దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ సత్యదేవుని కల్యాణ మహోత్సవాలకు వచ్చే భక్తుల అవసరాలకు, స్వామివారి శ్రీచక్రస్నానానికి ఏలేరు రిజర్వాయర్ నుంచి 200 క్యూసెక్కుల నీటిని పంపా జలాశయానికి విడుదల చేయాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. అయితే, అధికారులు ఎన్నికల ఏర్పాట్లలో బిజీగా ఉండటంతో ఈ పని జరగలేదు. ఈ నేపథ్యంలో పంపా ఒడ్డున పవర్ హౌస్ వద్ద జలాశయం గర్భంలో జేసీబీతో తాత్కాలికంగా కోనేరులా తవ్వి, దేవస్థానం బోరు నుంచి నీరు నింపుతున్నారు. ఈ పనులను ఈఓ రామచంద్ర మోహన్ మంగళవారం పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ఈ కోనేరులో గురువారం ఉదయానికి సుమారు నాలుగు అడుగుల లోతున నీరుండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీచక్రస్నానం నిర్వహించే పండితులు, పుణ్యస్నానాలు చేసే భక్తులకు బురద అంటుకోకుండా కోనేరు అడుగున ఇసుక బస్తాలు వేస్తున్నామని ఈ పనులను పర్యవేక్షిస్తున్న ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ తెలిపారు.

కృష్ణబాబు ఇకలేరు

- కొవ్వూరు ఎమ్మెల్యేగా ఐదుసార్లు విజయం
- ఉమ్మడి 'పశ్చిమ' రాజకీయాల్లో చక్రం తిప్పిన నేత
- వైఎస్సార్‌తో ప్రత్యేక అనుబంధం
- నేడు దొమ్మేరులో అంత్యక్రియలు



నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో కృష్ణబాబు (ఫైల్)



ఓదార్పు యాత్ర సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కృష్ణబాబు (ఫైల్)

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) (71) ఇక లేరనే వార్త జిల్లావాసులను తీవ్రంగా కలచివేసింది. ఆయన హైదరాబాద్‌లో మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో కన్ను మూశారనే సమాచారం తెలియడంతో కొవ్వూరు నియోజకవర్గంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఆయన మృతిపై అభిమానులు, బంధుమిత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజలు, అభిమానుల సందర్శనార్థం కృష్ణబాబు భౌతికకాయాన్ని మంగళవారం రాత్రి స్వగ్రామం దొమ్మేరులోని ఆయన నివాసానికి తీసుకుని వచ్చారు. ఆయన అంతిమ యాత్ర బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామ శివారున ఆయన కుటుంబీకుల సమాధులుండే వ్యవసాయ క్షేత్రంలో కృష్ణబాబు అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయన అంత్యక్రియలకు చుట్టుపక్కల నియోజకవర్గాలతో పాటు జిల్లావ్యాప్తంగా పార్టీలకు అతీతంగా పలువురు ప్రముఖులు హాజరు కానున్నారు.

కుటుంబ నేపథ్యం

ఆంధ్రా షుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల శ్రీరామచంద్ర వెంకటకృష్ణ రంగారావు – అచ్చాయమ్మ దంపతులకు కృష్ణబాబు మూడో సంతానం. ఆయన సతీమణి నాగమణి 2010లో మృతి చెందారు. కుమారులు వెంకట్రాయుడు, రవిలు పరిశ్రమలు నడుపుతున్నారు. కుమార్తె అర్చన గృహిణి. కృష్ణబాబు అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా, పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడిగా ఉన్నారు. కృష్ణబాబు ఆంధ్రా షుగర్స్ పూర్వ చైర్మన్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్‌కు స్వయానా సోదరి కుమారుడు (మేనల్లుడు). మాజీ కేంద్ర మంత్రి బోళ్ల బుల్లిరామయ్యకు స్వయానా బావమరిది. కృష్ణబాబుకు ఆంధ్రా షుగర్స్ సీఎండీ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి పెద్ద సోదరుడు. టీడీపీ నేత, ఆంధ్ర షుగర్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుత రామయ్య (అచ్చిబాబు) చిన్న సోదరుడు.



మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు (ఫైల్)

పలువురి దిగ్భ్రాంతి

మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మృతి పట్ల పలువురు దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి వైఎస్సార్ సీపీకి తీరని లోటు అని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మాజీ ఏఎంసీ చైర్మన్ బండి పట్టాభి రామారావు తదితరులు పేర్కొన్నారు. నియోజకవర్గంలో తనదైన ముద్ర వేసుకుని, ప్రజల కోసం పని చేసిన గొప్ప నాయకుడని అన్నారు. కృష్ణబాబు పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఉప్పులూరి విజయలక్ష్మి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, జెడ్పీటీసీ సభ్యురాలు బొంత వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు గారపాటి వెంకటకృష్ణ, బొల్లిన సతీష్, ముదునూరి నాగరాజు, పేరిచెర్ల బోసురాజు, ముదునూరి సూర్యనారాయణరాజు, మూడు నియోజక వర్గాలకు చెందిన ముఖ్య నాయకులు కృష్ణబాబు మృతికి సంతాపం తెలిపారు. పార్టీ పట్టణ కార్యాలయంలో టీడీపీ నాయకులు సంతాప సభ నిర్వహించి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, మాజీ మునిసిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, మద్దిపట్ల శివరామకృష్ణ తదితరులు సంతాపం తెలిపారు.

నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితం

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయాల్లో కృష్ణబాబు నాలుగు దశాబ్దాల పాటు చక్రం తిప్పారు. ముఖ్యంగా గోపాలపురం, కొవ్వూరు, పోలవరం నియోజకవర్గాలకు ఆయనే పెద్ద దిక్కుగా ఉండేవారు. అటు తణుకులో సైతం ఆయన కుటుంబీకులదే హవా నడిచేది. తాను ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలను గెలిపించడంలో కృష్ణబాబు క్రియాశీలక పాత్ర పోషించేవారు. ఆయన కొవ్వూరులో వరుసగా 1983, 1985 (మధ్యంతర ఎన్నికలు), 1989, 1994 సంవత్సరాల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభంజనం కొనసాగిన సమయంలో కూడా కృష్ణబాబు గెలుపొందారు. ఆయనకు వైఎస్సార్‌తో ప్రత్యేక అనుబంధం ఉండేది. ఇద్దరి పార్టీలూ వేరే అయినప్పటికీ స్నేహభావంతో ఉండేవారు. కృష్ణబాబు హయాంలోనే పైడిమెట్ట, తాడిపూడి ఎత్తిపోతల పథకాలను వైఎస్సార్ ప్రారంభించారు. తాడిపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవ సభలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్న కృష్ణబాబును వైఎస్సార్ స్వయంగా పిలిచి తన పక్కన కూర్చోబెట్టుకున్నారు. నియోజకవర్గంలో కృష్ణబాబు ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టారు. వైఎస్సార్ మరణానంతరం చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయన 2012లో వైఎస్సార్ సీపీలో చేరారు. అప్పటి నుంచీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పని చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడిగా కొనసాగుతున్నారు.

వస్తున్నాయ్ సత్యదేవుని రథచక్రాల్

- నేడు భారీ టేకు రథంపై ఊరేగనున్న స్వామి, అమ్మవార్లు
- ఆలయ చరిత్రలో తొలిసారిగా 36 అడుగుల ఎత్తు రథం వినియోగం
- సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకు..

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో ఐదో రోజు బుధవారం మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతం కానుంది. ఆలయ చరిత్రలో తొలిసారిగా 36 అడుగుల ఎత్తు కలిగిన నూతన టేకు రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించనున్నారు. ఈ ఊరేగింపు కొండ దిగువన మెయిన్‌రోడ్డులో సాయంత్రం ఐదు నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు సాగనుంది. స్వామి, అమ్మవార్ల రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణ మహోత్సవాలలో సత్యదేవుని ఊరేగింపు రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమవడం ఎప్పటి నుంచో ఆనవాయితీ. అయితే భద్రతా ఏర్పాట్లతో బాటు, ముందు జాగ్రత్తగా బుధవారం జరిగే రథోత్సవాన్ని సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభిస్తున్నారు. రాత్రి తొమ్మిది గంటల వరకు ఈ రథోత్సవం కొనసాగనుంది. ఈ రథోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్టు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ తెలిపారు.

రథోత్సవం ఇలా..

ఉదయం తొమ్మిది గంటలకు రథాన్ని పంపా సత్రం నుంచి తొలిపాంచా వద్దకు తీసుకువస్తారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి రథాన్ని పుష్పాలతో, విద్యుత్ దీపాలతో అలంకరిస్తారు. సాయంత్రం ఐదు గంటలకు సత్యదేవుడు, అమ్మవారిని రథంపై ఉంచి పూజలు చేస్తారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ కొబ్బరికాయలు కొట్టి రథం ముందు పోసిన కుంభం మీదుగా రథాన్ని లాగుతారు. రథోత్సవంలో భాగంగా సుమారు 200 మంది వివిధ కళారూపాలను ప్రదర్శిస్తారని అధికారులు తెలిపారు. రథోత్సవం సందర్భంగా బుధవారం సాయంత్రం నుంచి మెయిన్‌రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

పెద్ద రథంలేని లోటు తీరిందిలా...

135 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం వార్షిక ఆదాయం రూ.157 కోట్లు. అయినప్పటికీ సుమారు 50 సంవత్సరాల క్రితం తయారు చేయించిన ఊరేగింపు వాహనాలు మినహా భారీ రథం లేదు. వెండి రేకు తాపడం చేసిన చిన్న రథం ఉన్నా దాని ఎత్తు పది అడుగులకు మించదు. ఆ రథం కూడా శిథిలావస్థకు చేరడంతో కొత్తగా స్వామివారి ఊరేగింపునకు రథం చేయించాలన్న ఆలోచన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ గత ఏడాది కార్యరూపం దాల్చింది. దేవస్థానం ఈఓగా 2022–23 సంవత్సరంలో సేవలందించిన ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ స్వామివారిని రత్నగిరి ఆలయ ప్రాంగణంలో ఊరేగించేందుకు సుమారు 16 అడుగుల ఎత్తు కలిగిన చిన్నరథం, కల్యాణ మహోత్సవంలో కొండ దిగువన స్వామి, అమ్మవార్లను ఊరేగించేందుకు 36 అడుగుల ఎత్తు కలిగిన పెద్ద రథన్ని రూ.1.42 కోట్ల వ్యయంతో తయారు చేసేందుకు టెండర్లు ఖరారు చేశారు. వీటిని మురమండకు చెందిన మాణిక్యాంబ శిల్పకలా ఉడ్ వర్క్స్ అధినేతలు కొల్లాటి కామేశ్వరరావు, శ్రీనివాస్, మరో 20 మంది శిల్పులు తయారు చేశారు. రథసప్తమి నాడు చిన్న రథాన్ని ప్రారంభించారు. దీనిపై ప్రతి ఆదివారం స్వామి,అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఊరేగిస్తున్నారు.

కల్యాణ మహోత్సవాలలో స్వామి, అమ్మవార్లను ఊరేగించేందుకురూ.1.04 కోట్లతో 36 అడుగుల ఎత్తు, 14.6 అడుగుల వెడల్పు, 21 అడుగుల పొడవుతో చేయించిన టేకు రథాన్ని గత నెల 26వ తేదీన లాంఛనంగా ప్రారంభించారు. గత గురువారం మెయిన్ రోడ్డులో ఈ రథానికి ట్రయిల్ రన్ నిర్వహించారు. అయితే రథాన్ని ఎత్తే మోటార్ కెపాసిటీ తక్కువ ఉండడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది.



సత్యదేవుని రథానికి తుది మెరుగులు దిద్దుతున్న అధికారులు

రథం ఎత్తేందుకు జాకీకి 2హెచ్‌పీ మోటార్ ఏర్పాటు

రథం జాకీకి ఎక్కువ లోడు ఎత్తే మోటార్ బిగించాలని ఈఓ కె.రామచంద్రమోహన్ ఆదేశించారు. దాంతో మంగళవారం ఆ మోటార్ స్థానంలో 2హెచ్‌పీ మోటార్ ఏర్పాటు చేశారు. దేవస్థానం ఈఈ మురళి, ఎలక్ట్రికల్ డీఈ సత్యనారాయణ, చౌదరి తదితరుల సమక్షంలో ఆ మోటార్‌ను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ మోటార్‌కు జనరేటర్ కూడా అమర్చుతున్నారు.

కమిటీలు ఏర్పాటు చేశాం



తొలిపావంచా వద్ద నుంచి ఆంధ్రాబ్యాంక్ సెంటర్‌కు అక్కడ నుంచి దేవస్థానం హైస్కూల్ వద్ద గల టోల్‌గేట్ వరకు మళ్లీ అక్కడ నుంచి తొలిపావంచా వరకు రథోత్సవం జరుగుతుంది. రథోత్సవం నిర్వహణకు దేవస్థానం సిబ్బందితో పలు కమిటీలు ఏర్పాటు చేశాం. బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను కోరాం. భక్తులు, గ్రామస్తులు సహకరించాలి.

– కె.రామచంద్రమోహన్, ఈఓ, అన్నవరం దేవస్థానం

క్లుప్తంగా

టీ పొడి దుకాణాలపై విజిలెన్స్ దాడులు

మూడు షాపులపై కేసుల నమోదు



టీ పొడి దుకాణాలపై దాడులు చేసిన విజిలెన్స్ అధికారులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్న దుకాణాలపై అధికారులు మంగళవారం దాడులు చేశారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం టౌన్ హాలు రోడ్డులో ఉన్న తేజ అస్సాం టీ పొడి, కీర్తి అస్సాం టీ పొడి దుకాణాలపె దాడి చేయగా అక్కడ నిషేధించిన సింథటిక్ ఫుడ్ కలర్ టార్టాజైన్, సన్ సెట్ పసుపులను టీ పొడిలో కలపడం గుర్తించారు. వెంటనే ఆ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు పంపారు. టీ పొడిని కల్తీ చేయడానికి ఉపయోగిస్తున్న టార్టాజైన్ (పసుపు) సన్ సెట్ పసుపులను స్వాధీనం చేసుకున్నారు. ప్యాకింగ్ లైసెన్సు లేకపోవడం, టీ పౌడర్ ప్యాకెట్లపై కన్స్యూమర్ కేర్ వివరాలు లేకపోవడం గుర్తించారు. డోమెస్టిక్ గ్యాస్ సిలిండర్, స్టాంప్ లేని వెయింగ్ మెషీన్‌ను వాణిజ్య ప్రయోజనాల కోసం వినియోగించడం గుర్తించారు. అస్సాం టీ కంపెనీను తనిఖీ చేయగా టీ పౌడర్ ప్యాకెట్లపై కన్స్యూమర్ కేర్ వివరాలు, ప్యాకింగ్ లైసెన్సు లేకపోకపోవడం గుర్తించారు. ఈ దుకాణాలపై విజిలెన్స్, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాలు నాయుడు, నాగ వెంకటరాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేష్, లక్ష్మీనారాయణ, రెవెన్యూ, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న మునిపల్లి కోటిగట్టు ప్రాంతానికి చెందిన నాగారాపు లలిత (29) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మరణించింది. ఎస్ఐ కె.మనోహర జోషి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన నాగారపు భీమేంద్ర.. గొల్లవిల్లి పంచాయతీ పరిధి ఇందిరానగర్‌కు చెందిన లలితను ఐదు సంవత్సరాల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు. అయితే భార్యాభర్తల మధ్య తరచు గొడవలు జరిగేవి. భర్త వేధింపులు తాళ లేక సోమవారం సాయంత్రం లలిత ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని మరణించినట్టు భీమేంద్ర కుటుంబీకులు పోలీసులకు, లలిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి తహసీల్దార్ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో శవ పరీక్షలు నిర్వహించారు. తన అల్లుడు భీమేంద్ర తన కూతురు లలితను హతమార్చి ఉరి వేసుకున్నట్టు చిత్రీకరించాడని మృతురాలి తల్లి పరమట పుష్పలత ఆరోపిస్తున్నారు. మృతురాలి సోదరుడు పరమట ప్రసాద్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ వివరించారు. కొత్తపేట డీఎస్పీ కె.వి.రమణ, అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు సమక్షంలో కేసు విచారణ జరుపుతున్నామని, భీమేంద్రను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ జోషి తెలిపారు.

లెక్చరర్ సుబ్బారావుకు డాక్టరేట్, భారత్ కళారత్న అవార్డు

- బహుముఖ ప్రజ్ఞాశాలిగా అమెరికా జీహెచ్‌పీయూ గుర్తింపు
- ఈ నెల 25న చెన్నై భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ప్రదానం



వులుసు వీవీఎస్ సుబ్బారావు



రామచంద్రశ్రీహరి (రామం)

కొత్తపేట: స్థానిక ఒక ప్రైవేట్ కళాశాల అధ్యాపకుడు, కవి, రచయిత వులుసు వీరవెంకట సత్య సుబ్బారావు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) గౌరవ డాక్టరేట్, భారత్ కళారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఆ మేరకు జీహెచ్‌పీయూ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పీ మాన్యూల్ ధ్రువీకరణ పత్రాలు పంపినట్టు సుబ్బారావు మంగళవారం కొత్తపేటలో విలేకరులకు తెలిపారు. రావులపాలెం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన వులుసు సుబ్బారావు సత్యహరిశ్చంద్ర, బాలనాగమ్మ తదితర పౌరాణిక నాటకాలు, అన్నా – చెల్లెలు, పూలకంగడు, కనకపు సింహాసనమున హుష్‌కాకి, అన్నదాత తదితర సాంఘిక నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించిన కళాకారుడు. 2008లో కొత్తపేట వచ్చి స్థిరపడి ఒక ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా తన వృత్తిని కొనసాగిస్తూ, ప్రవృత్తిగా కవి, రచయితగా తన ప్రతిభను చాటుకుంటున్నారు. సుబ్బారావు బహుముఖ ప్రజ్ఞను గుర్తించిన జీహెచ్‌పీయూ గౌరవ డాక్టరేట్‌తో పాటు భారత్ కళారత్న అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 25 న చెన్నై భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో జరిగే కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా సుబ్బారావుకు డాక్టరేట్‌ను, అవార్డును ప్రదానం చేయనున్నారు.

పురోహితుడు రామంకు సేవారత్న అవార్డు

స్థానిక పురోహితుడు పెద్దింటి రామచంద్ర శ్రీహరి (రామం) జీహెచ్‌పీయూ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. ఆ మేరకు జీహెచ్‌పీయూ ఫౌండర్ అండ్ చైర్మన్ డాక్టర్ పీ మాన్యూల్ ధ్రువీకరణ పత్రాలు పంపినట్టు రామం విలేకరులకు తెలిపారు. ఆయన పలు ఆలయాల్లో అర్చకునిగా, గ్రామ పురోహితునిగా పనిచేస్తూ దేశ, విదేశాల కరెన్సీ నోట్లు, నాణేలు, డాలర్స్, రకరకాల వస్తువులు, 124 సంవత్సరాల పంచాంగాలు సేకరించారు. వివిధ సంస్థల అవార్డులు, రికార్డులు సాధించారు. ఈ నెల 25 న చెన్నైలో అవార్డును స్వీకరించనున్నారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడి మృతి

- ఐదుకు చేరిన రోడ్డు ప్రమాద మృతుల సంఖ్య
- అన్నదమ్ముల మృతితో ఏవీపాలెంలో విషాద ఛాయలు



చిలకలపూడి సురేష్ (ఫైల్)

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడి గ్రామం వద్ద ఇటీవల ధాన్యం లోడు ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిలకలపూడి సురేష్ (35) మంగళవారం మృతి చెందాడు. దీంతో ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య ఐదుకు చేరుకుంది. ఈ నెల 14వ తేదీ సాయంత్రం పి.గన్నవరం మండలం ఊడిమూడి వద్ద రోడ్డు పక్కన 10 మంది వ్యవసాయ కార్మికులు ట్రాక్టర్‌లో ధాన్యం బస్తాలు లోడ్ చేసి, పగ్గాలు కడుతుండగా రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా ఢీకొట్టిన విషయం విదితమే. ప్రమాదంలో జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యనారాయణ, ఈరి కట్లయ్య, ఆదిమూలంవారిపాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు అక్కడికక్కడే మృతి చెందారు. వీరిలో మణిబాబు అన్న చిలకలపూడి సురేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతడిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రిలో చేర్చారు. పరిస్థితి విషమించడంతో అతడిని గత శుక్రవారం రాత్రి కాకినాడలోని ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సురేష్ మృతదేహానికి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ కేసు నమోదు చేయగా, సీఐ ప్రశాంతకుమార్ దర్యాప్తు చేస్తున్నారు. ఒకే కుటుంబంలో అన్నదమ్ములు మృతి చెందడంతో ఆదిమూలం వారిపాలెంలో విషాద ఛాయలు అలముకున్నాయి. సురేష్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు భోరున విలపించారు. మృతుని తండ్రి చిలకలపూడి వెంకటేశ్వరరావు, తల్లి సత్యనారాయణయమ్మ, అన్న గోపాలకృష్ణ, వారి కుటుంబ సభ్యులు దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

ఉప్పుటేరులో దూకి వివాహిత మృతి

కొత్తపల్లి: వివాహేతర సంబంధం కారణంగా ఒక వివాహిత ఉప్పుటేరులో దూకి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అమరవల్లి గ్రామానికి చెందిన బోరా కనకదుర్గ(38)అదే గ్రామానికి చెందిన బోరా చిన రమణారెడ్డి కొంతకాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కనకదుర్గను కొంతకాలంగా చిన రమణారెడ్డి వేధింపులకు గురి చేస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త బోరా రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



వివాహిత మృతదేహం

రత్నగిరిపై వేదఘోష



స్వామి, అమ్మవార్ల సమక్షంలో సాగిన పండిత సదస్యం

150 మంది పండితులకు సత్కారం

అన్నవరం : రత్నగిరి సత్యదేవుని సన్నిధి మంగళవారం వేదఘోషతో ప్రతిధ్వనించింది. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాలలో భాగంగా వైశాఖ శుద్ధ త్రయోదశి, మంగళ వారం సాయంత్రం నవదంపతులు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవార్ల సమక్షంలో వేదపండిత సదస్యం జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన వేద, స్మార్త పండితులు స్వామివారి ముందు తమ వేదవిద్వత్తును ప్రదర్శించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది పండితులు వచ్చారు. మధ్యాహ్నం మూడు గంటలకు శ్రీసత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను పెళ్లిపెద్దలు సీతారాములు వెంటరాగా అనివేటి మంటపం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చి అక్కడి వేదికపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఆలయ వేద పండితుడు ఉపాధ్యాయుల వేంకట సుబ్రహ్మణ్య ఘనపాఠి అధ్యక్షతన పండిత సదస్సు నిర్వహించారు. పండితులు స్వామివారి ముందు నాలుగు వేదాలు పఠించారు. తరువాత దేవస్థానం వేదపండితులు సత్యదేవుడు, అమ్మవార్లకు ఆశీస్సులందచేశారు.

పండిత సత్కారం

అనంతరం వేదపండితులను దేవస్థానం చైర్మన్ రోహిత్, ఈఓ కె.రామచంద్రమోహన్ సత్కరించారు. సత్కారం పొందిన వారిలో తిరుపతి వైదిక యూనివర్సిటీ వేదార్థ విభాగ అధిపతి ప్రవా రామకృష్ణ సోమయాజీ, రాజమహేంద్రవరానికి చెందిన మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, గుళ్లపల్లి సీతారామచంద్ర ఘనపాఠి, విజయవాడ దేవస్థానం వేద పండితులు ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్య ఘనపాఠి, తంగిరాల వేంకటేశ్వర ఘనపాఠి, అన్నవరం దేవస్థానం విశ్రాంత వేద పండితులు ముష్టి కామశాస్త్రి తదితరులున్నారు.

అన్నవరంలో నేడు

- తెల్లవారుజామున 3.00: సుప్రభాత సేవ
- ఉదయం 8.00: చతుర్వేద పారాయణ
- సాయంత్రం 4.00: కొండ దిగువన దేవస్థానం ఉద్యానవనంలో స్వామివారి వనవిహారం
- సాయంత్రం 5.00: కొండ దిగువన నూతన టేకు రథంపై సత్యదేవుడు, అమ్మవారి ఊరేగింపు
- ఉదయం 7.00 – 10.00, సాయంత్రం 5.00 – రాత్రి 11.00: రత్నగిరి కళావేదిక మీద, కొండ దిగువన సాంస్కృతిక కార్యక్రమాలు

శాంతికి ఉన్న శక్తి అనంతం

ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు



జ్యోతి వెలిగిస్తున్న ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు

బోట్‌క్లబ్: మన దేశంలో శాంతి అనే పదానికి ఎంతో శక్తి ఉందని ప్రవచన బ్రహ్మ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక సూర్యకళామందిరంలో మంగళవారం రాత్రి ప్రముఖ సంగీత వాగ్గేయకారుడు కొచ్చర్లకోట రామరాజు కీర్తనల ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. భారతదేశంలో సంగీతానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. ఎందరో మహానుభావులు సంగీత కళ ద్వారా వర్షాలు కురిపించి తమ ఘనతను చాటుకున్నారన్నారు. మన హిందూ దేవుళ్ల చేతుల్లో సైతం ఏదో ఒక సంగీత పరికరాన్ని అలంకరించి ఉంటారని పేర్కొన్నారు. మానసిక ప్రశాంతత కోసం మాత్రమే సంగీతం కాదన్నారు. ఎంతో మంది సంగీత కళాకారులు తమ సంగీత సాధనాలతో భగవంతుని సైతం మెప్పించారన్నారు. సంగీత కళాకారుడు కొచ్చర్లకోట రామరాజు కీర్తనలను ఆవిష్కరించే భాగ్యం తనకు దక్కడం గొప్ప విషయమన్నారు. ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యులు వారణాసి రామ్‌మాధవ్ మాట్లాడుతూ రామరాజు వంటి మహానీయులు అప్పటిలోనే ఉచితంగా సంగీతం నేర్పడంతో పాటు నేర్చుకొనేవారికి ఉచితంగా వసతి కల్పించారన్నారు. కళలకు కుల మతాలు లేవన్నారు. కళలు డబ్బులు సంపాదించుకొనేందుకు కాదన్నారు. బ్రహ్మ వ్యవస్థలో కుల విభజన ఎక్కడా లేదన్నారు. 6వ శతాబ్దంలో కులాంతర వివాహాలు సైతం జరిగేవన్నారు. కొచ్చర్లకోట రామరాజు చారిటబుల్ ట్రస్ట్ న్యూఢిల్లీ ప్రతినిధి కొచ్చర్లకోట ప్రభాకర సుందరరావు మాట్లాడుతూ ఎప్పటి నుంచో కలగా మిగిలిన తన తాతగారి కీర్తనలు ఇన్ని రోజులకు సీడీ రూపంలో తయారు చేసి వినే భాగ్యం తమకు కలగడం గొప్ప విషయమన్నారు. అనంతరం రామరాజు రచించిన కీర్తనలను ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి ఆలపించారు. తొలుత ముఖ్య అతిథులు జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. నార్త్ ఈస్ట్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీవీఎస్ఎల్ఎన్ మూర్తి, సుందర స్వామి పాల్గొన్నారు.